ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 14 డిసెంబరు 2024





మైక్రో ఇరిగేషన్‌లో ప్రథమం

● రీసర్వే అర్జీల పరిష్కారంలో అథమస్థానం

● కలెక్టర్ల సదస్సులో వెల్లడైన జిల్లా పరిస్థితి

వైసీపీ సర్కారు హయాంలో వెనకబడిపోయిన రంగాలపై కూటమి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతోంది. బుధ, గురువారాల్లో అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లాల వారీగా సమగ్ర సమాచారాన్ని ముందు పెట్టుకుని సీఎం చంద్రబాబు సమీక్షించారు.శాఖల వారీగా సమాచారాన్ని పరిశీలిస్తే.. చాలా అంశాల్లో మన జిల్లా వెనుకంజలో వుంది.పాల దిగుబడిలో,మైక్రో ఇరిగేషన్‌లో జిల్లా ముందంజలో నిలవగా రీసర్వే అర్జీల పరిష్కారంలో, అపార్ నమోదులో,జిల్లా బాగా వెనుకబడింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

వెనకబడ్డ అంశాలివీ

● రీసర్వే అర్జీల పరిష్కారంలో జిల్లా 26వ స్థానంలో నిలిచింది.327 గ్రామాల్లో సభలు నిర్వహించగా.. 16,128 అర్జీలు వచ్చాయి.వీటిలో 554 అర్జీలు (3.44శాతం) మాత్రమే పరిష్కారమయ్యాయి.● రీసర్వే చేసిన భూములకు వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ ఫొటోలు, పేర్లతో సర్వే రాళ్లను నాటారు.జిల్లాలోని 301 గ్రామాల్లో 3,33,066 రాళ్లను నాటగా 12,659 (3.80%) రాళ్లపై ఫొటోలను మాత్రమే తొలగించారు. ఈ అంశంలో జిల్లా 25వ స్థానంలో ఉంది.● పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 1356 రోడ్డు పనులు మంజూరు కాగా 1102 పనుల్ని ప్రారంభించారు. 421 పనులు పూర్తి చేసి జిల్లా 24వ స్థానంలో నిలిచింది. ● అపార్ నమోదులో జిల్లా 76.49 శాతంతో 21వ స్థానంలో నిలిచింది.●రక్తహీనత కలిగిన గర్భిణులు 56 శాతం వుండడంతో జిల్లా మూడో స్థానంలో ఉంది.ఈ అంశంపై కలెక్టర్, వైద్యశాఖ యంత్రాంగం దృష్టి సారించాలని ప్రభుత్వం సూచించింది.అలాగే టీనేజ్ ప్రెగ్నెన్సీల్లో జిల్లా 6వ స్థానంలో వుంది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 654మంది బాలికలు గర్భం దాల్చినట్లు ప్రభుత్వం గుర్తించింది.39 మంది బాలికలకు పెళ్లిళ్లు అవుతుండగా.. 38 చోట్ల అడ్డుకున్నారు.● జిల్లాలోని 5,92,343 గృహాలను జియో ట్యాగింగ్ చేయడంలో 95.77 శాతంతో జిల్లా 16వ స్థానంలో ఉంది. ●ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధుల వ్యయంలో జిల్లా 10వ స్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.194 కోట్లను ఖర్చు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.81.73 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.● గ్రీవెన్స్ డే అర్జీల పరిష్కారంలో జిల్లా 13వ స్థానంలో ఉంది. ఈ ఏడాది జూన్ 15 నుంచి డిసెంబరు 10 వరకు 7447 అర్జీలురాగా, 4608 అర్జీలు (61.88%) పరిష్కారమయ్యాయి.● ప్రభుత్వం వద్దన్నా సచివాలయ ఉద్యోగులకు డిప్యుటేషన్లు ఇస్తున్నట్లు గుర్తించింది.జిల్లాలో 67మంది సచివాలయ ఉద్యోగులు ఇతర ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈ విషయంలో జిల్లా 12వ స్థానంలో వుంది.

ముందున్న రంగాలివీ

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పేరుతో 60శాతం కేంద్ర, 40 శాతం రాష్ట్ర నిధులతో అమలు చేస్తున్న మైక్రో ఇరిగేషన్ పథకం అమలులో మన జిల్లా ప్రథమస్థానంలో వుంది.21 వేల హెక్టార్ల లక్ష్యం ఇవ్వగా.. ఇప్పటివరకు 28097 హెక్టార్లకు రైతులు రిజిస్ట్రేషను చేసుకున్నారు. 11579 హెక్టార్లలో విచారణ పూర్తి చేసి, 3288 హెక్టార్లకు రాయితీలు మంజూరు చేశారు. ●పాల దిగుబడిలోనూ జిల్లా ముందంజలో ఉంది. గేదెలు రోజుకు సగటున 9.9 లీటర్ల పాలను ఇస్తుండగా.. ఆవులు 9.7 లీటర్లను ఇస్తున్నాయి. గేదెల విషయంలో తొలి స్థానంలో ఉండగా.. ఆవుల విషయంలో జిల్లాకు మూడో స్థానం దక్కింది.● చేతి వృత్తుల వారికి 5 శాతం వడ్డీతో రూ.3 లక్షల వరకు రుణాలందించేందుకు ప్రారంభించిన 'పీఎం విశ్వకర్మ యోజన'కు జిల్లాలో 32,058 మంది దరఖాస్తు చేసుకోగా, 1146 మందికి రుణాలు మంజూరు చేశారు.ఈ అంశంలో జిల్లా ఐదవ స్థానంలో ఉంది.● టీబీ వ్యాధిగ్రస్థుల విషయంలో మన జిల్లా చివరి నుంచి మూడో స్థానంలో ఉంది.●రహదారుల మరమ్మతుల్లో జిల్లా మూడవ స్థానంలో వుంది.రెండు విడతల్లో రూ.12 కోట్లతో 1709 కిలోమీటర్ల రోడ్ల రిపేరు పనులు మంజూరయ్యాయి. మొత్తం 317 పనుల్లో 266 పూర్తయ్యాయి.● జిల్లాకు 1824 గోకులం షెడ్లు మంజూరు కాగా 153 షెడ్లను పూర్తి చేసి 8వ స్థానంలో నిలిచింది.

ఫ్రీహోల్డ్‌లో లక్ష ఎకరాలు

వైసీపీ హయాంలో జిల్లాలో 1,60,676 ఎకరాల భూముల్ని ఫ్రీహోల్డ్‌గా మార్చినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది.వీటిలో 1,05,409 ఎకరాలు అసైన్డ్ ల్యాండ్స్ వున్నట్లు గుర్తించింది.అలాగే 2561.33 ఎకరాల ఫ్రీహోల్డ్ ల్యాండ్స్‌ను రిజిస్ట్రేషన్ చేశారు. వీటిలో 1231.66 ఎకరాలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు నిబంధనల మేరకు జరగ్గా.. మిగిలిన 1329.67 ఎకరాల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది.

నీటి సంఘాల ఎన్నికలు నేడు

ఓటు హక్కు వినియోగించుకోనున్న 49,030 మంది రైతులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లోని 215 చిన్ననీటి వినియోగదారుల సంఘాలు, కృష్ణాపురం ప్రాజెక్టుకు సంబంధించి 5 సాగునీటి వినియోగ దారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. అత్యధికంగా నింద్ర మండలంలో 16, ఐరాల మండలంలో 14, అత్యల్పంగా గుడుపల్లెలో ఒక సాగునీటి సంఘం ఉన్నాయి. 49,030 మంది రైతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు డీఆర్వో మోహన్‌కుమార్ నియమితులు కాగా , కో- ఆర్డినేటర్‌గా జలవనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి వ్యవహరించనున్నారు. అలాగే 1357 మంది పీవోలు, 1357 మంది ఏపీవోలు, 182మంది అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, 32 మంది ఇరిగేషన్ ఏఈలను రూట్ ఆఫీసర్లుగా నియమించారు. మొత్తం 2521 మంది సిబ్బంది ఎన్నికల నిర్వహణలో పాల్గొంటున్నారు. ప్రతి నీటి సంఘంలో ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు. గతంలో చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు జరుగుతుండగా, ఈసారి రహస్య పద్ధతిలో బ్యాలెట్ పేపర్లద్వారా జరుగుతాయి.శుక్రవారం ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. ప్రతి సంఘ పరిధిలో 40 నుంచి 250 మంది ఓటర్లుంటారు.శనివారం ఉదయం 9నుంచి 10గంటల్లోపు నామినేషన్లు స్వీకరిస్తారు. 10.30గంటల వరకు నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. ఒక్కో సభ్యుడికి ఒక్కో నామినేషన్ దాఖలైతే ఏకగ్రీవమైనట్లు ప్రకటిస్తారు.అలాకాకుండా నామినేషన్లు ఎక్కువమంది దాఖలుచేస్తే ఎన్నికలు నిర్వహిస్తారు.గెలుపొందిన సభ్యులతో మధ్యాహ్నం మీటింగ్ ఏర్పాటు చేసి, ఒక్కో చెరువుకు ఆ ఆరుగురిలో ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసి అధికారికంగా ప్రకటిస్తారు.

వాన ఆగినా తగ్గని వెతలు

నీట మునిగిన పంట పొలాలు



ఇళ్ళత్తూరు వద్ద పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు

నగరి/విజయపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):వర్షం ఆగినా వరద వుధ్రుతి తగ్గలేదు. విజయపురం మండలంలోని మొత్తం 42 చెరువుల్లో 40 చెరువులు నిండు కుండల్లా మారాయి.గొల్లకండ్రిగ వద్ద చెరువు మొరవ పారడంతో పంట పొలాలు నీట మునిగాయి. ఒరూరు వద్ద నాగలాపురం - తిరుత్తణి రోడ్డుపై వరద నీటి ప్రవాహంతో వాహన రాకపోకలు కష్టమయ్యాయి.ఇళ్ళత్తూరు వద్ద చెరువుకు వచ్చే వరవ కాలువ ఆక్రమణకు గురి కావడంతో వరద నీరు రోడ్డుపై ఏరులై పారి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది.నగరి కుశస్థలీ నదిలో వరద వుధ్రుతితో వంతెన కొట్టుకుపోయినట్లు శుక్రవారం సాయంత్రం 5గంటలకు స్థానికులు గుర్తించారు. దీంతో కీళపట్టు, నెత్తంకండ్రిగ, వీకేఆర్‌పురం, తడుకుపేట,ముడిపల్లి, మేళపట్టు ప్రాంతాలకు వెళ్లే వాహనాలను ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మళ్లించారు.గుండ్రాజుకుప్పం, మాంగాడు, మేళపట్టు చెరువులు కలుజు పారుతున్నాయి.

నేడు, రేపు పాఠశాలలు నిర్వహించకూడదు: డీఈవో

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండవ శనివారం, ఆదివారం సెలవులు కావడంతో నేడు,రేపు పాఠశాలలు నిర్వహించకూడదని డీఈవో వరలక్ష్మి ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇది అన్ని పాఠశాలల యాజమాన్యాలకు వర్తిస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు గుర్తించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సగటు వర్షపాతం 190.9 మిమీ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలలో సగటు వర్షపాతం 54.8 మిమీ నమోదుకావాల్సి ఉండగా జిల్లాలో శుక్రవారం నాటికి 190.9 మిమీ వర్షపాతం నమోదైంది. ఈ నెల 1, 2, 3 తేదీల్లో కూడా భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే.మరోవైపు అల్పపీడన ద్రోణి ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా సరాసరి 47.7 మిమీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా విజయపురంలో 89.8, అత్యల్పంగా 10.2 మిమీ వర్షం కురిసింది. మండలాల వారీగా ఎస్ఆర్‌పురంలో 80.6మిమీ, వెదురుకుప్పంలో 75, కార్వేటినగరంలో 74.2, నగరిలో 73.4, పూతలపట్టులో 70.8, నింద్రలో 68.2, తవణంపల్లెలో 68, చిత్తూరురూరల్‌లో 67.0, గుడిపాలలో 66.8, పాలసముద్రంలో 61.6, పులిచెర్లలో 58.6, పెనుమూరు, ఐరాల, చిత్తూరు అర్బన్‌లో 56.4, జీడీ నెల్లూరులో 48.6, యాదమరిలో 46.4, సదుంలో 45.2, బంగారుపాళ్యంలో 45, సోమలలో 43.4, రొంపిచెర్లలో 37.6, పెద్ద పంజాణిలో 32.4, గంగవరంలో 31.6, పలమనేరులో 27.8, చౌడేపల్లెలో 24.8, శాంతిపురంలో 23.2, బైరెడ్డిపల్లెలో 22.4,వి.కోటలో 21.6, రామకుప్పంలో 16.8, కుప్పంలో 14.2, గుడుపల్లెలో 11.2 మి.మీ వర్షపాతం నమోదైంది.గంగాధరనెల్లూరు మండలంలో ఈనెల 1 నుంచి 13వతేది వరకు 208 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.





వెంకటాపురం రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు - నీటిలో నగరి పూలతోటలు



వరద వుధ్రుతికి కుశస్థలీ నదిపై కొట్టుకు పోయిన వంతెన

ఆరు నెలల్లో రైతులకెంతో చేశాం

● అవగాహన ర్యాలీలో టీడీపీ నేతలు



ర్యాలీగా వస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న ఐదేళ్లు రైతుల సంక్షేమాన్ని వైసీపీ పట్టించుకోలేదని...అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని టీడీపీ నేతలు చెప్పారు.కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో రైతులకు చేసిన సంక్షేమ పథకాలపై శుక్రవారం రైతులతో కలిసి జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ తాతముత్తాతల ద్వారా రైతులకు సంక్రమించిన భూముల్లో అధికారబలంతో జగన్ ఫొటోతో ఉన్న హద్దురాళ్లను ఏర్పాటు చేయగా,వాటిని తొలగించి రైతుల కళ్లలో ఆనందాన్ని నింపామన్నారు. 90శాతం సబ్సిడితో డ్రిప్ పరికరాలను రైతులకు అందించామని, పాడిపరిశ్రమాభివృద్ధికి అవసరమైన గోకులం షెడ్లను పూర్తి సబ్సిడీతో మంజూరు చేశామన్నారు. చెరువుల అభివృద్ధిని పట్టించుకోకుండా చివరకు సాగునీటి సంఘాల ఎన్నికలను కూడా జగన్ నిర్వహించలేకపోయాడని విమర్శించారు. ఇప్పుడు రైతుల పట్ల మొసలికన్నీరు కారుస్తున్న వైసీపీ నేతలు గత ఐదేళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి నిరసన ర్యాలీలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా టీడీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీకి కూటమి నేతలకు పోలీసులు అనుమతివ్వగా... కలెక్టరేట్ వరకు వెళతామని టీడీపీ నేతలు పట్టుబట్టారు.దీంతో పోలీసులు, టీడీపీ నేతల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కూటమి నేతలు పాత కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లగా పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, చెన్నకేశవులు నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, కాజూరు రాజేష్, నౌషద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చొక్కాణి ఉత్సవం



వెలుగుతున్న చొక్కాణి

శ్రీకాళహస్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహానంది వద్ద శుక్రవారం రాత్రి చొక్కాణి ఉత్సవం వేడుకగా జరిగింది. గురువారం రాత్రి కలశస్థాపనతో వేదపండితులు క్రతువును ప్రారంభించారు. కలశస్థాపన అనంతరం బాలాదీపాలను అమ్మవారి సన్నిధి వద్ద వెలిగించి స్వామి సన్నిధి వద్దభద్రపరిచారు. శుక్రవారం రాత్రి వరకు బాలాదీపాలను నిరంతరాయంగా వెలిగేలా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం తాటిచెట్టును మహానంది వెనుకవైపున దారాలతో లాగి నిలబెట్టారు. దీని చుట్టూ తాటాకు మట్టలను కప్పారు. రాత్రి ఆలయం నుంచి బాలాదీపాలను ఊరేగింపుగా తాటిచెట్టు వరకు తీసుకొచ్చి ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం చొక్కాణిని వెలిగించారు. చొక్కాణి జ్యోతి అఖండ ప్రజ్వలనతో ప్రకాశించింది. ఇందులోని భస్మాన్ని ఈశ్వరప్రసాదంగా భావించి భక్తులు పోటీపడి ఇళ్లకు తీసుకెళ్లారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వస్తున్న స్వామి అమ్మవార్లు

సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చండి: వైసీపీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చిత్తూరులో శుక్రవారం దుర్గమ్మ ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు వైసీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు రూ.20వేలు ఇస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అందించిన రైతు బీమాను ఎత్తివేయడం అన్యాయమన్నారు. పంటల ధరల స్థిరీకరణను చేపట్టి రైతుల వద్ద ఉన్న తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం జేసీ విద్యాధరికి వినతిపత్రాన్ని అందించారు.ఎమ్మెల్సీ భరత్,డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వైసీపీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు సునీల్‌కుమార్, కృపాలక్ష్మి, వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, గాయత్రిదేవి, కుమారరాజ, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీగా వస్తున్న వైసీపీ నేతలు →





వామ్మో..!

తిరుమల శ్రీవారిసేవసదన్ వెనుకభాగంలోని గార్డెన్‌లో శుక్రవారం ఈ భారీ నాగు పాము పట్టుబడింది. పామును గుర్తించిన గార్డెన్ సిబ్బంది పాములు పట్టే భాస్కర్‌నాయుడికి సమాచారం ఇచ్చారు. చాకచక్యంగా దీనిని పట్టుకున్న ఆయన, ఆ తర్వాత అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





అక్కగార్లకు కార్తీక పూజలు

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ రవాణా విభాగం ఆధ్వర్యంలో కార్తీకమాస పూజ జరిగింది. డ్రైవర్లు, స్థానికులు కలిసి అక్కదేవతల ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం టీటీడీ రవాణా విభాగం అధికారులు, సిబ్బంది సారె సమర్పించారు. కనుమరోడ్లలో భక్తులు సురక్షితంగా ప్రయాణాలు సాగించేలా అనుగ్రహించాలని అక్కదేవతలను ప్రార్థించారు. టీటీడీ లా ఆఫీసర్ వరప్రసాద్‌రావు, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి పాల్గొన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రేపు కార్తీకదీపోత్సవం

పౌర్ణమిగరుడసేవ రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 15న కార్తీక పౌర్ణమి నాడు దీపోత్సవం జరుగుతుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తర్వాత నేతి వత్తులతో దీపాలను వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలోని శ్రీవారికి హారతి ఇస్తారు. ఈ తర్వాత వరుసగా గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారి మేడ, ద్వార పాలకులు, గరుడ్వాళ్వారు, వరదరాజస్వామి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభ అర, తాళ్ళాపాక అర, బాష్యకారుల సన్నిధి, యోగనరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళ అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయక మండపం, మహద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామిఆలయం, స్వామి పుష్కరిణి వద్ద దీపాలను వెలిగిస్తారు. ఈసందర్భంగా సహస్ర దీపాలంకారసేవను, పౌర్ణమి గరుడసేవను టీటీడీ రద్దు చేసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులూ వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 61,178

తలనీలాలు సమర్పించినవారు: 22,464



చదువులమ్మ కన్నుమూత

పద్మావతి కాలేజీ రూపశిల్పి రాజేశ్వరీమూర్తి మృతి

104వ పుట్టిన రోజు జరుపుకున్న మూడు రోజులకే న్యూయార్క్‌లో ఆఖరిశ్వాస

తిరుపతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తి శుక్రవారం కన్నుమూశారు. ఈనెల 10న న్యూయార్క్‌లోని తన ఇంట్లో 104వ పుట్టినరోజును జరుపుకున్న ఆమె రెండు రోజుల కిందట అస్వస్థతకు గురయ్యారు. అక్కడి ఆసుపత్రిలో భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా కళాశాల రూపశిల్పిగా ఆమె కృషి ఎనలేనిది. టీటీడీ ఆధ్వర్యంలో 1952లో పద్మావతీ మహిళాకళాశాల ప్రారంభం అయింది. 1954లో కళాశాల ప్రిన్సిపాల్‌గా కాకినాడకు చెందిన రాజేశ్వరీ మూర్తి నియమితులయ్యారు. 22 ఏళ్ల పాటు ఈ బాధ్యతల్లో ఉన్న ఆమె అందించిన సేవలు అనన్యసామాన్యమైనవి. కళాశాల భవనాల నిర్మాణం మొదలు, లైబ్రరీ, లేబరేటరీ, హాస్టళ్ల దాకా ప్రతిదీ ఆమె కనుసన్నల్లో ఏర్పాటయ్యాయి. పద్మావతి కాలేజీలో చదువుకున్న వందలాది మంది విద్యార్థులు వివిధరంగాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారంటే దాని వెనుక ఈమె కృషే కనిపిస్తుంది.



అమెరికాలో 104వ పుట్టిన రోజు వేడుకల్లో రాజేశ్వరీమూర్తి

ఆఖరి కోరిక తీరకుండానే..

రాజేశ్వరీమూర్తి మృతితో ఆమె శిష్యులు కన్నీటితో ఆమె జ్ఞాపకాలు తలపోసుకుంటున్నారు. "పద్మావతి కాలేజి అంటే రాజేశ్వరీమూర్తికి ప్రాణం. అమెరికాలో ఉన్నా ఆమె పద్మావతి కాలేజీనే కలవరించేవారు. ఇక్కడి విశేషాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. ఒక్కసారి అక్కడికి రావాలని ఉంది అని ఇటీవలే నాతో చెప్పారు. అది ఆమె ఆఖరి కోరిక. తీరకుండానే వెళ్లిపోయారు' అని ఆమె శిష్యురాలు ప్రేమావతి గుర్తు చేసుకున్నారు.

గొప్ప విద్యావేత్త : ఆడవాళ్లకు చదువులెందుకు అనే రోజుల్లో కాకినాడకు చెందిన రాజేశ్వరీమూర్తి పీయూసీ చేశారు. ఆ తర్వాత చదువు సాగలేదు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్‌గా చేస్తున్న మూర్తితో పెళ్ళయ్యాక, ఆయన ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. బీఎస్సీ ఆనర్స్ చేసి అదే కాలేజీలో గణిత బోధకురాలిగా చేరారు. అప్పటి టీటీడీ చైర్మన్‌చెలికాని అన్నారావు ఆహ్వానం మేరకు ఆమె పద్మావతీ కాలేజి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1976 దాకా పద్మావతిలోనే పనిచేశారు. వీరికి పిల్లలు లేరు. భర్త చనిపోయాక అమెరికాకు వెళ్లారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టొరల్ చేశారు. 'కమ్యూనిటీ కాలేజీస్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై పరిశోధన చేశారు. అమెరికాలోని యునైటెడ్ నేషన్స్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ కేంద్రంలో రిజిస్ట్రార్‌గా రిటైరయ్యారు. అమెరికా పౌరులకు మాత్రమే ఇచ్చే బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డును ఆమె అందుకున్నారు.

జలపాతాల సవ్వడి



తిరుమల కొండల్లో ..

రెండురోజులుగా కురిసిన వానలకు తిరుమల కొండల్లోంచి జాలువారుతున్న నీటి ధారలు.. భక్తులకు కనువిందుగా మారాయి. మొదటి ఘాట్ రోడ్డులో తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణించేవారికి ఇవి కనిపిస్తాయి. అవ్వాచారికోన లోయ వెంబడి ఉన్న కొండలపై నుంచి జాలువారుతున్న నీటి ధారల్లో కాలినడక భక్తులు తడిచి ఆనందిస్తున్నారు. వాహనాల్లో ప్రయాణించేవారు ఈ అందాలను చూసి ముగ్ధులవుతున్నారు. తిరుపతి సమీపించే సమయంలో మాల్వాడిగుండం హోరు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జలపాత తుంపర్లు వానలా ప్రయాణికులను తడుపుతున్నాయి. అలిపిరి దాటి దిగాక కపిలతీర్థం స్వాగతం పలుకుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి






వెయ్యిలింగాలకోనలో..

శ్రీకాళహస్తిలో పలుచోట్ల జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. వేదాంలోని వెయ్యిలింగాలకోన వద్ద కైలాసపర్వతాల నుంచి గంగమ్మ ఉధృతంగా కిందకు దూకుతూ చూపరులను అబ్బుర పరుస్తోంది. చిన్నమిట్టకండ్రిగ భైరవకోనలో కొండలనుంచి జలం కిందకు దూకుతోంది. కోనపై కొండల నుంచి గంగాజలం శివలింగాన్ని అభిషేకిస్తున్న దృశ్యాలను భక్తులు ఆసక్తికరంగా వీక్షిస్తున్నారు. శ్రీకాళహస్తి శివార్లలోని రాజీవ్‌నగర్ వద్ద హరహర తీర్థం జలపాతం వద్ద యువత స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





వెయ్యిలింగాలకోన - రాజీవ్‌నగర్ వద్ద హరహర తీర్థం

మురిసిన చెంచురాజుకండ్రిగ



స్వగ్రామంలోని గుకేష్ ఇంటి ముందు గ్రామస్తుల సంతోషం

పిచ్చాటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన యంగ్ ఇండియన్ సొంతూరు చెంచురాజుకండ్రిగ మురిసిపోయింది. స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది. పిచ్చాటూరు మండలం చెంచురాజుకండ్రిగకు చెందిన ఈఎన్‌టీ సర్జన్ రజనీకాంత్, మైక్రో బయాలజిస్టు పద్మ దంపతులు చెన్నైలో స్థిరపడ్డారు. వీరి కుమారుడు గుకేష్ చిన్నప్పటి నుంచీ చలాకీగా ఉంటూ.. చదరంగంపై ఉన్న ఆసక్తితో 12 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇప్పుడు వరల్డ్ చెస్ చాంపియన్ అయిన గుకేష్.. తమ గ్రామస్తుడు కావడం గర్వంగా ఉందంటూ స్థానికులు వారి ఇంటి ముందు సంబరాలు చేసుకున్నారు.

గుజరాత్‌లో గోడౌన్లపై టాస్క్‌ఫోర్స్ దాడి

● రూ.2 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు స్మగ్లర్లు కొత్తగా రూట్లు మారుస్తున్నారు. గతంలో బెంగళూరు, చెన్నై, వెస్ట్ బెంగాల్ మీదుగా స్మగ్లింగ్ జరిగేది. ఇప్పుడు గుజరాత్‌ను ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఇక్కడి నుంచి వెళ్లిన టాస్క్‌ఫోర్సు పోలీసులు గుజరాత్ రాష్ట్రం పటాన్‌లో గోడౌన్లపై శుక్రవారం దాడి చేశారు. 4.5 టన్నుల బరువైన 155 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడికి అందిన సమాచారం మేరకు తిరుపతి టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ షరీఫ్ బృందం గుజరాత్ వెళ్లి పటాన్ పోలీసుల సహకారంతో దాడులు చేశారు. ఉత్తమ కుమార్, హన్సిరాజ్, పరదేశి ప్రధాన నిందితులుగా గుర్తించారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ రెండు కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు.

ఆ బడిలో ఒకే ఒక్కడు!

» మరో పాఠశాలలో ముగ్గురే విద్యార్థులు

» విశాఖ జిల్లాలోని ఏకోపాధ్యాయ బడుల దుస్థితి



మరుబాయి పాఠశాలలో నలుగురు విద్యార్థులు



మరడ దాసరిపేట పాఠశాలలో ఒకే విద్యార్థి

పెదగంట్యాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదో ప్రభుత్వ పాఠశాల.. విద్యార్థులు ఎంతమంది అనుకుంటున్నారా?.. ఒకే ఒక్కడు!! మరో పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులే!. ఇదీ విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలం మరడ దాసరిపేట, మరుబాయి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని పరిస్థితి. మరడ దాసరిపేట పాఠశాలలో అన్ని వసతులూ ఉన్నాయి. అయితే ఇక్కడ నాలుగో తరగతి చదువుతున్న ఒకే ఒక విద్యార్థి ఉన్నాడు. అలాగే మురుబాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులకు కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇంకో చిన్నారిని వారం రోజులుగా అనధికారికంగా పాఠశాలకు వస్తోంది. ఆ చిన్నారితో కలుపుకొన్నా ఇక్కడ చదివేది నలుగురే!. ఈ రెండూ ఏకోపాధ్యాయ పాఠశాలలు. ఒకవేళ ఉపాధ్యాయులు రాకుంటే పాఠశాలకు సెలవే. దీంతో తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు.

ఆసక్తి చూపని తల్లిదండ్రులు!

వాస్తవానికి మరడ దాసరిపేట, మరుబాయి గ్రామాల్లో 30 మందికి పైగా చిన్నారులు ఉంటారు. వీరిని స్థానికంగా ఉన్న పాఠశాల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో ప్రయత్నించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకుగాను గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ రెండు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా కృషి చేస్తామని పెదగంట్యాడ ఎంఈవో శ్రీనివాసరావు చెప్పారు.

షార్‌లో వేగంగా గగన్‌యాన్ పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. తొలుత మానవరహిత ప్రయోగం చేపట్టనున్నారు. ఒక రోబోను అంతరిక్షంలోకి పంపి సురక్షితంగా భూమిమీదకు తీసుకువస్తారు. ఈ ప్రయోగం జనవరిలో జరిగే అవకాశం ఉంది. ఇందుకోసం హెచ్‌ఎల్‌వీఎం3-జీ 1 రాకెట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ రాకెట్‌లో కీలకమైన దశలో వినియోగించే ఎస్200 సాలిడ్ మోటారు సెగ్మెంట్‌ను రాకెట్ అసెంబ్లీంగ్ బిల్డింగ్‌కు శుక్రవారం తరలించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని దశల అనుసంధాన పనులు పూర్తయ్యాక రాకెట్ సంసిద్ధత సమావేశంలో ప్రయోగ తేదీని నిర్ణయిస్తారు.



ఎస్200 సాలిడ్ మోటారు సెగ్మెంట్



షార్ డైరెక్టర్ రాజరాజన్ జెండా ఊపడంతో అనుసంధాన భవనానికి తరలుతున్న హెచ్‌ఎల్‌వీఎం3-జీ 1 రాకెట్

కిరాయికి దిగి కిరాతకానికి ఒడిగట్టారు

» నేలకొండపల్లి దంపతుల హత్య కేసులో వీడిన మిస్టరీ

ఖమ్మం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన దంపతులను వారింట్లో కిరాయికి ఉంటున్న వ్యక్తులే చంపేశారు. దంపతులు డబ్బున్నవారని తెలిసి.. పథకం ప్రకారం అద్దెకు దిగి.. ఇంట్లోకి చొరబడి ప్రాణాలు తీసి, దొరికనంత దోచుకొని ఉడాయించారు! ఈ మేరకు నేలకొండపల్లిలో 17 రోజుల క్రితం జరిగిన దంపతులు యర్రా వెంకటరమణ (62), కృష్ణకుమారి (60) దంపతుల హత్య వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆ వివరాలు.. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మోగులూరుకు చెందిన షేక్ అబిద్ అలియాస్ అబిద్ అలీ, సోహైల్, ఆరిఫ్ అనే వ్యక్తి బైసెక్సువల్! 2011లో కంచికచర్లలో జరిగిన ఓ హత్య కేసులో 2014లో జీవితఖైదు శిక్ష పడింది. అప్పటి నుంచి రాజమండ్రి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు ఈ ఏడాది పెరోల్ మీద బయటకొచ్చాడు. గడువు ముగిసినా జైలుకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కోదాడకు వెళ్లి పేరు మార్చుకున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ అబిద్.. నేలకొండపల్లిలోని బియ్యం వ్యాపారం చేసే యర్రా వెంకటరమణ(62) గురించి తెలుసుకున్నాడు. ఆయన డబ్బులు బాగా సంపాదించాడని, ఇంట్లో ఆయన, భార్య కృష్ణకుమారి(60) మాత్రమే ఉంటారని తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో పలు పోర్షన్లు కిరాయికిస్తారని తెలుసుకున్న అబిద్... నవంబరు రెండో వారంలో ఆ ఇంట్లో అద్దెకు దిగాడు. అదును చూసి.. తన స్నేహితులతో కలిసి ఓనర్‌ఇంట్లోకి చొరబడ్డాడు. కృష్ణకుమారి, వెంకటరమణలను హత్యచేసి..వారి శరీరంపైఉన్న, ఇంట్లోని బంగారం,డబ్బుతో పారిపోయాడని పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ సోదాలు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల దుకాణాలు, గోదాముల్లో శుక్రవారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక సోదాలు జరిపారు. అధిక ధరలతోపాటు, లైసెన్సు లేకుండా ఎరువులు విక్రయించడం, తక్కువ తూకం వంటి లోపాలను గుర్తించాయి. రైతులను ఇబ్బందిపెడితే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డైరెక్టర్ హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరించారు.

విజయవాడ పశుసంవర్ధకశాఖ డివిజన్ ఏర్పాటు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కొత్తగా పశుసంవర్ధకశాఖ డివిజన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కంకిపాడు కేంద్రంగా ఉన్న పశుసంవర్ధకశాఖ డివిజన్‌ను గన్నవరానికి మార్చింది. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, నందిగామ, కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, గన్నవరం, గుడ్లవల్లేరులో డివిజన్లు ఏర్పాటయ్యాయి.

వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ ఆందోళన కలిగిస్తున్నాయి. హోటళ్లకు వరసగా ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే.తాజాగా శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. కళాశాలలో బాంబులు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. కళాశాల అధికారులు వెంటనే చంద్రగిరి డీఎస్పీకి, తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు సమాచారమిచ్చారు. హుటాహుటిన బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాయి. ప్రిన్సిపల్, డీన్, రెక్టార్ చాంబర్లు, పరిపాలనా భవనం, హాస్టల్ గదులు, పరిసరాలను తనిఖీ చేశారు. కళాశాలకు దాదాపు మూడు కిలోమీటర్ల పరిధిలో తనిఖీలు చేసి బాంబు బెదిరింపు మెయిల్ నకిలీవని నిర్ధారించారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా, నెల రోజుల వ్యవధిలో తిరుపతిలోని దాదాపు ఐదారు స్టార్ హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లోనూ తనిఖీలు చేసి బాంబులు లేవని నిర్ధారించారు. ఇప్పుడు వ్యవసాయ కళాశాలకు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.



చంద్రబాబు రైతు వ్యతిరేకి

- కలెక్టరేట్ వద్ద ఆందోళనలో వైసీపీ నేతలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ప్రతియేటా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, దానిని తుంగలో తొక్కిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. 'అన్నదాతకు అండగా' అనే పేరుతో వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ నేతలు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు రైతు వ్యతిరేకి అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ వాగ్దానాలు చేసి ఆతర్వాత పట్టించుకోలేదని అన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వలేకే జగన్‌అధికారం కోల్పోయారని చెప్పారు. రైతుల పక్షాన పోరాటం చేస్తామంటూ, అవసరమైతే జైలుకు వెళతామన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు మోసకారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మేయర్ శిరీష, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో నరసింహులు వినతిపత్రం అందజేశారు.



రైతుల్లేని కార్యక్రమం

అన్నదాతలకు అండగా అంటూ వైసీపీ చేపట్టిన కార్యక్రమంలో రైతులు మాత్రం కనిపించలేదు. కాలేజీ విద్యార్థులను తరలించుకు వచ్చారు. పట్టణంలోని కొందరు మహిళలను కూడా ఎన్నికల సమయంలో తరలించినట్టుగా తీసుకువచ్చి నిలబెట్టారు. ఎందుకు ఈ నిరసన కార్యక్రమం అని అడిగితే, చాలా మంది చెప్పలేకపోయారు. తమను తీసుకువస్తే వచ్చామని చెప్పారు.

పలువురు ఇన్‌ఛార్జులు డుమ్మా

భారీ కార్యక్రమం అంటూ పిలుపు ఇచ్చినా తిరుపతి జిల్లాలో పలు నియోజకవర్గాలకు చెందిన వైసీపీ ఇన్‌చార్జిలు ఈ నిరసన కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. మాజీ మంత్రి రోజా, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట సంజీవయ్య, గూడూరు నుంచి మేరుగ మురళి ధర్నాకు రాలేదు. కార్యకర్తలు కూడా పలుచగా కనిపించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా పాల్గొనలేదు. పార్లమెంటు సమావేశాల కారణంగా తిరుపతి ఎంపీ గురుమూర్తి హాజరవలేదు.

రేపు కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం జిల్లాకు విచ్చేస్తున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు ఆర్‌సీపురం మండలం రామాపురం వద్ద ఉన్న సిద్ధేశ్వర బ్రహ్మరుషి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి పద్మావతి అతిథిగృహానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటారు. 3 గంటలకు చేనేత శాఖ రీజనల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి పద్మావతి అతిథిగృహానికి చేరుకుంటారు. సోమవారం వేకువజామున 3 గంటలకు సిద్ధేశ్వర బ్రహ్మరుషి ఆశ్రమం చేరుకుని అక్కడి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 7 గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరుతారు.

బీఎన్‌కండ్రిగలో 169.8మి.మీ వర్షపాతం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిజిల్లాలో శుక్రవారం ఉదయం వరకు నమోదు వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. బీఎన్ కండ్రిగ 169.2మి.మీ. కేవీబీపురం 167.6, వడమాలపేట 144.2 సూళ్ళూరుపేట 143, డక్కిలి 136.8, వరదయ్యపాళెం 122.4, బాలయపల్లి 119.8, తడ 115.6, పుత్తూరు 114.8, నారాయణవనం 109.2మి.మీ. వర్షపాతం నమోదు అయింది.

స్విమ్స్‌కు రూ. 10,00,100 విరాళం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పేద రోగులకు వైద్య సేవలు అందిస్తున్న శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్ కె.వెంకటేశ్వరరావు రూ.10,00,100 విరాళం అందించారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను శుక్రవారం ఆయన ఛాంబర్‌లో కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు. దాతలకు స్విమ్స్ యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.



మణికంఠేశ్వరాలయంలో దీపాలతో ఈవో పెంచలకిషోర్, సిబ్బంది

కాణిపాక ఆలయంలో కార్తీక దీపోత్సవం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో తమిళ కార్తీక దీపోత్సవాన్ని(కృత్తికా నక్షత్రం) శుక్రవారం రాత్రి ఆలయ పెంచలకిషోర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలను ఈవో పెంచలకిషోర్, ఆలయ ఉభయదారులతో కలసి భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చారు. అనంతరం ప్రధాన ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద, ముందు భాగంలో, ఆలయం పూర్తిగా దీపాలను పెట్టారు. తర్వాత అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వరాలయంలోకి ఈవో తన సిబ్బందితో కలసి దీపాలను వెలిగించారు. ఏఈవో రవీంద్రబాబు, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఎస్‌ఐ ధరణిధర పాల్గొన్నారు.







జడ ఈశ్వరుడి కొండపై.. - రాజుగుడిలో.. - 75 దొడ్డిపల్లె సప్తకన్నికల ఆలయంలో..

చిత్తూరు జడ ఈశ్వరుడి కొండపై

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు గిరింపేట జడ ఈశ్వరుడి కొండపై సుబ్రమణ్యం స్వామి ఆలయ ఈవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ వంశ పారంపర్య ధర్మకర్త రాజశేఖర్ కార్తీకదీపాన్ని వెలిగించారు. నగరంలోని గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకుడు బి.కుమార్ ఆధ్వర్యంలో లక్షదీపారాధన చేశారు. 75 దొడ్డిపల్లె సప్తకన్నికల ఆలయంలో ధర్మకర్తలు నళని తిరుకుమరన్ దంపతుల ఆధ్వర్యంలో లక్షదీపారాధన నిర్వహించారు. టీడీపీ నాయకులు సీఆర్ రాజన్, దొరబాబు, గోపాలకృష్ణ, కోదండయాదవ్, రాజశేఖర్, మాధవన్ తదితరులు పాల్గొన్నారు. అగస్తేశ్వర, రంగచారి వీధి రాజుగుడుల్లోనూ కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంతపేట పాంచాలిపురం పరమేశ్వర కొండపై కార్తీక దీపం వెలిగిస్తుండగా ఆకాశంలో గరుడ పక్షి దీప ప్రదక్షిణలు చేయగా భక్తులు పులకించారు.



అగస్తేశ్వర ఆలయంలో..

దేవరకొండ బురుజుపై

బంగారుపాళ్యం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొగిలి శివాలయానికి అనుబంధ ఆలయమైన దేవరకొండ బురుజుపై శుక్రవారం సాయంత్రం కార్తీక దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా పార్వతీ సమేత జలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. భక్తులు బురుజు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. అలాగే మొగిలిలోని మొగిలీశ్వరుడి ఆలయం ముందు మహిళలు దీపారాధనతోపాటు అక్కడున్న ఉసిరి చెట్టుకు పూజలు చేశారు.



బురుజుపై దీపం



జలకంఠేశ్వర స్వామి

అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. పార్లమెంటుపై ఉగ్రవాదుల దాడి జరిగి 23 ఏళ్లు గడిచిన సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంటు ప్రాంగణంలో అమరవీరులకు నివాళి అర్పించారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికిప్రతీకగా నిలిచే పార్లమెంటుపై జరిగిన ఉగ్రవాద దాడికి ఎదురొడ్డి తమ ప్రాణాలు అర్పించి.. అమరవీరులుగా నిలిచారని కొనియాడారు. అలాంటి వీరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అని ఎంపీ తెలిపారు.



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి సూచించారు. శుక్రవారం 39 గ్రామ సభలను నిర్వహించామన్నారు. తొమ్మిది చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 5051 అర్జీలు అందగా, శుక్రవారం ఒక్కరోజే 1551 వచ్చాయన్నారు. వీటిల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై 41, కేంద్ర ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై 31, 22ఏలో మార్పులు - చేర్పులపై 21, ఇళ్ల స్థలాలకోసం 58, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్న్‌మెంట్ ల్యాండ్‌పై 96, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారంపై 82, రీసర్వేపై 34, సచివాలయాలపై 67, ఆర్వోఆర్ కోసం 779, ఇతరత్రా విషయాలపై 28 అర్జీలు అందాయన్నారు. ఇప్పటివరకు సదస్సుల్లో 16,956 మంది పాల్గొనగా, శుక్రవారం 1954 మంది పాల్గొన్నట్లు వివరించారు.

కుప్పం డివిజన్‌కు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో పోస్టు

కుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని కుప్పం డివిజన్‌కు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో పోస్టు మంజూరైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె డివిజన్‌కు ఈ పోస్టు ఉండేది. మదనపల్లె ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలోకి వెళ్లిపోయింది. దీంతో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో పోస్టును కొత్తగా కుప్పం డివిజన్‌కు కేటాయిస్తూ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఈనెల 12వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు.

జమ్మూకశ్మీర్‌లో జవాన్ మృతి

కుప్పం, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలానికి చెందిన పొన్నుస్వామి (23)అనే జవాన్ జమ్మూ కశ్మీర్‌లో మరణించాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మంకలదొడ్డి పంచాయతీ ములకలపల్లె గ్రామానికి చెందిన మునియప్ప కుమారుడు పొన్నుస్వామి. పొన్నుస్వామి రెండేళ్లక్రితం సైన్యంలో చేరారు. జమ్మూకశ్మీర్‌లో విధుల్లో ఉండగా రెండు రోజుల క్రితం అనారోగ్యం పాలై మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు శుక్రవారం సాయంత్రం సమాచారం అందింది. పొన్నుస్వామి పార్థివదేహాన్ని శనివారం స్వగ్రామానికి తరలించి, అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



పొన్నుస్వామి

17న పూతలపట్టు అభివృద్ధి సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమీక్షా సమావేశం ఈనెల 17వ తేదీన కాణిపాకంలోని ఆలయ కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు జరగనుంది.ఎమ్మెల్యే మురళీమోహన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి డీఎఫ్‌వో, డీఆర్వో, డీఈవో, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, పీఆర్ ఎస్‌ఈ, ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ, ఎండోమెంట్ ఏసీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, డీఎంహెచ్‌వో, డీఆర్డీఏ పీడీ, చిత్తూరు డీఎల్డీవో, చిత్తూరు కమిషనర్, చిత్తూరు, పలమనేరు ఆర్డీవోలతో పాటు నియోజకవర్గానికి సంబంధించిన డివిజినల్, మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురానికి చెందిన ఓ ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.అనంతపురం పట్టణానికి చెందిన ఓ బాలిక(15) చిత్తూరు జిల్లాలో చదువుకుంటోంది. డిసెంబరు 3వ తేదీన కళాశాల వద్దకు వచ్చిన హరికృష్ణ ఆమెను తన వెంట అనంతపురం తీసుకెళ్లాడు.ఓ గుడిలో పెళ్లి చేసుకోవాలని చెప్పగా ఆమె నిరాకరించింది. దీంతో హరికృష్ణ బలాత్కారానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకొని తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో ఈనెల 10న బాలిక తల్లి కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం కల్లూరులో హరికృష్ణను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 14 మందిని అరెస్టు చేశారు. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం కొత్తవెంకటాపురం వద్ద కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌చార్జి సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది మఫ్టీలో వెళ్లి కొత్తవెంకటాపురం సమీపంలోని అల్లయ్య ఇటుకల బట్టీ వద్ద పేకాట స్థావరంపై దాడిచేశారు. 14మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,370, తొమ్మిది ద్విచక్ర వాహనాలు, తొమ్మిది మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

నేడు తిరుపతిలో ఏపీఈఆర్‌సీ సమావేశం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఏపీఈఆర్‌సీ చైర్మన్ టి.రామసింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సంస్థ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమీక్షించనున్నట్లు వివరించారు.

సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

● కుప్పం కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమనే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యానికి, విజన్‌కు అనుగుణంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సిబ్బందికి పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన టీడీపీ కౌన్సిలర్లతో కలిసి సచివాయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీ సచివాలయాల్లో సుమారు 120 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 30 మంత్రి మాత్రమే పనిచేస్తున్నారన్నారు. వీరిలోనూ 17 మంది మాత్రమే సర్వే కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారన్నారు. అయినా రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలతో పోటీపడి మరీ పనిచేస్తున్నారని ప్రశంసించారు. అయితే ఇది చాలదని చాలా పనులు అలాగే పెండింగులో ఉండి పోయాయని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో హౌస్ హోల్డ్ సర్వే, సీనియర్ సిటిజన్స్ సర్వేలు సహా అయిదు సర్వేలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఆయా సర్వేల వల్ల ప్రజావసరాలు గుర్తించి సమస్యలు పరిష్కరించడం, మౌలిక సదుపాయాల కల్పించడం సులభమవుతుందని వివరించారు. ఆయా సర్వేలను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కౌన్సిలర్లకు వారివారి పరిధిలో జరుగుతున్న సర్వేలు, అభివృద్ధి, ఇతర కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు సోము, ఎమ్మార్. సురేశ్, సురేశ్, కుప్పం నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు

ఆస్తి అడిగిన వదినపై మరుదుల దాడి

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటా అడిగిన మహిళపై మామ, మరుదులు దాడిచేశారు. దీంతో ఆమె చీమల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన శుక్రవారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు... మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె గ్రామానికి చెందిన కృష్ణప్పకు నలుగురు కుమారులు. హరి, రమేశ్, శివ, మురళి. వీరందరికీ వివాహాలు జరిగాయి. పెద్ద కుమారుడు హరి తన భార్య సావిత్రితో కలసి వేరే కాపురం వెళ్లాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలం క్రితం హరి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ క్రమంలో సావిత్రి తన భర్తకు రావాల్సిన భూముల్లో భాగం ఇవ్వాలని కోరింది. దీంతో మామ కృష్ణప్ప, మరుదులు కలిసి ఆమెపై దాడిచేశారు. మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

స్టేషన్ ఎదుటే హత్యాయత్నం

సోమల, డిసెంబరు 13: అక్క కుమారుడిపైనే మేనమామ కొడవలితో హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సోమల పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం చోటు చేసుకుంది. సోమల జయంతి కాలనీకి చెందిన మునస్వామి కుమారుడు శుభకర్‌కు నంజంపేటకు చెందిన రామకృష్ణ కుమార్తె హిమబిందుతో పదేళ్ల క్రితం వివాహమైంది. మునస్వామి సొంత అక్క మనవరాలే హిమబిందు. దీంతో ఇరుకుటుంబాల మధ్య మంచి సఖ్యత ఉండేది. హిమబిందు సోమల మండలంలోని వల్లిగట్ల సచివాలయంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. శుభకర్ ప్రైవేట్ కంపెనీలో సేల్స్‌మెన్. కొన్ని నెలలుగా శుభకర్, హిమబిందుల మధ్య సఖ్యత లేక తరచూ గొడవలు జరిగేవి. పోలీసులు కౌన్సిలింగ్ జరిపి పంపేసేవారు. ఈ క్రమంలోనే హిమబిందు భర్తను వీడి పుట్టినింటికి చేరింది. తర్వాత భర్తపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఇరువర్గాల వారు సోమల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో హిమబిందు తండ్రి రామకృష్ణ స్టేషన్ ఎదుట ఉండగా మునస్వామి కొడవలితో ఆయన మెడపై కొడవలితో నరికాడు. తీవ్ర రక్త గాయం కావడంతో పోలీసులు హుటాహుటిన తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన రామకృష్ణ

రుయాలో ఈఎన్‌టీ సేవలు మృగ్యం

చుట్టపుచూపుగా వైద్యుల విధులు

పది గంటలకు కూడా హాజరుకాని వైనం

ప్రైవేటు ఆస్పత్రులకు వస్తే మెరుగైన వైద్యం పొందవచ్చని రోగులకు హితబోధ



వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు



ఈఎన్‌టీ విభాగంలో ఉదయం 10 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారుల గది

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ల వాడకం, శబ్ద కాలుష్యం కారుణంగా చెవికి సంబంధించిన సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారు. మారుతున్న వాతావరణం వల్ల ముక్కు, గొంతు సమస్యలతో బాధపడే వారి సంఖ్య కూడా బాగా పెరిగింది. ఈ క్రమంలో ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు) వైద్యం కోసం రుయాస్పత్రికి రోగులు క్యూ కడుతున్నారు. గతంలో రోజుకు 30 నుంచి 40 మంది రోగులు మాత్రమే ఓపీకి వచ్చేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 80కు పైగా పెరిగింది. మంగళ, శుక్రవారం రోజుల్లో సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చే వారిలో అధికంగా చెవి సమస్య ఉన్నవారే. ఆ రెండు రోజుల్లో ఈఎన్‌టీ విభాగంలో ఓపీ రెండింతలు పెరుగుతుంది. అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి. సాధారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓపీ వైద్య సేవలు అందించి, 3-5 గంటల మధ్య రోగుల రిపోర్టులు పరిశీలించి అవసరమైన వైద్య సేవలు అందించాలి. కానీ వైద్యులు 10 గంటలకు కూడా రావడం లేదు. ఆపైన వచ్చినా 12 గంటలు దాటితే ఒక్క నిముషం కూడా ఉండటంలేదు. ఆ తరువాత కేవలం వైద్య విద్యార్థులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని రోగులు పేర్కొంటున్నారు. వారు కూడా మధ్యాహ్నం 12.30 దాటితే 'సమయం ముగిసింది రేపు రండి' అంటూ పంపేస్తున్నారని చెబుతున్నారు. కొందరు డాక్టర్లు 'ఇక్కడ వైద్య పరికరాలు సరిగా లేవు..దగ్గర్లోని మా క్లినిక్‌కు వస్తే బాగు చేస్తామని' చెప్పి పంపుతున్నారు. ఈ క్రమంలో రోజూ ఓపీ వంద వరకు వస్తున్నా వైద్య సేవలు మాత్రం 40 మందికి కూడా అందడం లేదు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

రేణిగుంట ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

రేణిగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రాజేష్ సస్పెండయ్యారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్ గిరిబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవకతవకలపై అందిన ఫిర్యాదుల మేరకు ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ఉదయ్‌భాస్కర్ మూడు రోజులపాటు సమగ్ర విచారణ జరిపిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. వాటి ఆధారంగా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజేష్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ పనిచేసే అధికారులు ఒకరి తర్వాత మరొకరు తాము చేసిన తప్పులకు సస్పెండవుతుండటం చర్చనీయాంశంగా మారింది. కాగా, గతంలో ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసి సస్పెండైన ఓ అధికారి మళ్లీ పోస్టింగ్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

పెద్దల మందలింపుతో విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలిసిపోయిందనే భయంతో ఇంజనీరింగు విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి శివజ్యోతినగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు కథనం మేరకు.. పులిచెర్లకు చెందిన ఉమేష్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ చెల్లెలు గాయత్రితో కలసి శివజ్యోతినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గాయత్రి బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ప్రేమలో పడినట్లు తెలుసుకుని కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపంతో ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లి వచ్చిన ఉమేష్ ఈ విషయాన్ని గమనించి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ లోకేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి, గాయత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. శవ పరీక్ష నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దివ్యాంగుల శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరాలు ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయి. వీటిని పకడ్బందీగా నిర్వహించాలి' అని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవోలతో టెలీకాన్ఫరెన్ నిర్వహించారు. అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, చేతి కర్రలు, వాకర్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, టచ్ ఫోన్లు, తదితర ఉపకరణాలను అందించడం జరుగుతుందన్నారు. 17న చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల, 18న ఎస్‌ఆర్‌పురం జడ్పీ హైస్కూల్, 19న పూతలపట్టు జడ్పీ హైస్కూల్, 20న నగరి పీఎన్‌సీ ప్రభుత్వ బాలుర హైస్కూల్, 21న పుంగనూరు బీఆర్ ప్రభుత్వ హైస్కూల్, 22న పలమనేరు జడ్పీ హైస్కూల్, 23న కుప్పంలోని రాజువారి పార్కు వద్ద, 24న రామకుప్పం జడ్పీ బాలుర హైస్కూల్‌లో శిబిరాలు ఉంటాయన్నారు. హాజరయ్యేవారు యూడీఐడీ కార్డు, ఆధార్, సదరం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మొబైల్ నెంబర్‌తోపాటు రెండు సెట్ల జెరాక్సులు వెంట తీసుకురావాలన్నారు.



పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జిగా ఆరీఫా



పుంగనూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జిగా ఎస్.ఆరీఫా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పుంగనూరులో పనిచేస్తున్న న్యాయమూర్తి వాసుదేవరావు వైజాక్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో కుప్పంలో పనిచేస్తున్న న్యాయమూర్తి ఆరీఫా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చెన్నకేశవులు, న్యాయవాదులు అంజిబాబు, గురుమూర్తి తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

మూడు చెరువులకు గండ్లు

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో పులిచెర్ల మండల పరిధిలో మూడు చెరువులకు గండ్లు పడ్డాయి. గండ్లు పడిన చెరువుల్లో 106 రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ తెట్టుపల్లి సమీపంలోని నాయనచెరువు, మతుకువారిపల్లి పంచాయతీ శ్రీనివాసపురం సమీపంలోని చట్టారెడ్డిచెరువు, నేలకుంటచెరువు ఉన్నాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఇరిగేషన్ ఏఈ చెరువుల వద్దకు చేరుకొని గండ్లుపడిన కట్టలను పరిశీలించారు. నాయనిచెరువుకు రెండు చోట్ల పడిన గండ్లను పూడ్చే పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. మిగిలిన రెండు చెరువులకు చిన్న బొందలు పడ్డాయి. వాటిని కూడా త్వరలోనే పూడ్చిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చెరువులు వర్షం నీటితో ఇప్పుడిప్పుడే మొరవలెత్తడం ప్రారంభమయ్యాయన్నారు. చెరువుల పరిస్థితులపై ఎప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బంది సమాచారం సేకరించాలన్నారు. ప్రమాదకరంగా ఉండే చెరువుల వద్దకు ప్రజలను వెళ్లనీయకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, వెంకటరమణ, నజీర్ తదితరులు మరమ్మతుల పనులను పరిశీలించారు.

రేపు ఉచిత కంటి చికిత్స శిబిరం

రామకుప్పం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు చికిత్సలు కొనసాగుతాయని వివరించారు. అర్హులైన వారికి పీఈఎస్ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబరు తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు చరమగీతం


సదస్సులో తహసీల్దారు బాబు, టీడీపీ నాయకులు

రామకుప్పం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా నెలకొన్న భూసమస్యలకు చరమగీతం పాడటమే రెవెన్యూ సదస్సుల ధ్యేయమని రామకుప్పం తహసీల్దారు బాబు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి తెలిపారు. శుక్రవారం రామకుప్పం గ్రామసచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీవీరవి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆదిల్, మంజునాథ్, అవినాశ్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించాలి

రామకుప్పం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల లావాదేవీలకు సంబంధించిన లెక్కలను గ్రామ సమాఖ్య అధ్యక్షులు పారదర్శకంగా నిర్వహించాలని వెలుగు ఏపీఎంలు శ్రీనివాసమూర్తి, పార్వతమ్మ కోరారు. శుక్రవారం మండల వెలుగు కార్యాలయంలో మండల పరిధిలోని సంఘమిత్రలు, గ్రామ సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో వారు మాట్లాడారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చూడాలన్నారు. సీసీలు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

శాంతిపురం, డిసెంబరు 13 ((ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తావుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ రెస్కో వైస్ చైర్మన్ చలపతిస్వామిలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అబకలదొడ్డి గ్రామ సచివాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శివయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏఎంసీ నాగరాజు, వెంకటేషు, రమేష్, సత్యేంద్రశేఖర్, పీవీ.నాగరాజు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌కు టీవీ వితరణ

శాంతిపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌కు అదే గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ డైరెక్టర్ బసవరాజు రూ.80 వేలు విలువ చేసే టీవీని వితరణ చేశారు. ఎస్‌ఐ నరేష్‌కు శుక్రవారం టీవీని అందించారు. తన పెద్ద కుమారుడు కీర్తిశేషులు కిరణ్ జ్ఞాపకార్థం టీవీని అందించినట్లు బసవరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో రాళ్లబూదగూరు వాసులు రాము, పీసీలు పరమేష్ బేటప్ప పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

పలమనేరు, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీలో జనరల్, ఎంపీ ల్యాండ్స్ ద్వారా సుమారు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మొత్తం 18 పనులు చేపడుతుండగా వాటిలో 5 పనులు సాధారణ నిధులతో మిగిలిన 15 పనులు ఎంపీ ల్యాండ్స్‌తో చేపడుతున్నామని వివరించారు. సీసీ రోడ్లు, తాగునీటి కోసం చేపడుతున్న పనులకు కేటాయించినట్లు తెలిపారు.

నేడు, రేపు శ్వాసకోశ సమస్యలపై అవగాహన సదస్సు

కుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రి వైద్య కళాశాలలో శని, ఆది వారాలలో చిన్నపిల్లల్లో కలిగే శ్వాసకోశ వ్యాధి సంక్రమణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లల్లో తరచూ వచ్చే శ్వాసకోశ వ్యాధుల సమస్యలు, పాటించాల్సిన వైద్య విధానాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

లక్ష్మీనరసింహుడికి విశేషపూజలు



కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీ నరసింహుడు భక్తులకు విశేషంగా దర్శన మిచ్చారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా రొంపి చెర్లకు చెందిన చెంగల్రాయశెట్టి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

గ్యాస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన అవసరం


మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

పుంగనూరు రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ హాస్టల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ విజయ భాస్కర్‌రెడ్డి, నరసింహులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం



పుంగనూరు రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఆర్‌పీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన రాఘవరాయల్‌ను పుంగనూరు ఆర్‌పీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజ కులస్తులను అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జనార్ధన్‌రాయల్, నానబాల కుమార్, ఆనంద్‌రాయల్, యుగంధర్‌రాయల్, పూల భాస్కర్‌రాయల్, ఆంజప్ప రాయల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివదీపోత్సవం



బైరెడ్డిపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమానుచేను గ్రామ సమీపంలో వున్న కుదిరిగానిగుట్టపై శుక్రవారం సాయంత్రం బైరెడ్డిపల్లెకు చెందిన విశ్వ బ్రాహ్మణులు శివదీపాన్ని వెలిగించారు. తమిళ నాడులోని తిరువణ్ణామలై అరుణా చలేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం జరిగేరోజు కుదిరిగాని గుట్టపై కూడా దీపం వెలిగించడం ఆన వాయితీగా కొనసాగిస్తు న్నారు. ఇందులో భాగంగానే దీపాన్ని వెలిగించి పూజలు నిర్వహిం చారు. కుదిరిగానిగుట్టపై వెలిగించిన దీపాన్ని శివదీపమని, మరుసటిరోజు బైరెడ్డిపల్లె ఆంజ నేయస్వామి ఆలయంలో వెలిగించే దీపాన్ని విష్ణుదీపంగా కొలుస్తారు. బైరెడ్డిపల్లె పరిసర గ్రామాల ప్రజలు శివదీపాన్ని దర్శించుకున్నారు. విశ్వబ్రాహ్మణులు ముత్తాచారి, రాజేంద్రాచారి, గజేంద్రాచారి, సతీష్‌ఆచారి, ఆనందాచారి పాల్గొన్నారు.

పంటల బీమా చేసుకోండి

రామకుప్పం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిధిలోని మామిడి, టమోటా తోటల రైతులు ఈనెల 31లోగా తమ పంటలకు బీమా చేయించుకోవాలని ఉద్యానాధికారి సాగరిక కోరారు. మామిడికి ఎకరాకు రూ.7150, టమోటాకు ఎకరాకు రూ.1250 ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినపుడు ఎకరా మామిడికి రూ.35,000, ఎకరా టమోటాకు రూ.25,000 వర్తిస్తుందన్నారు. వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని ఆమె తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రెస్కో డీఈ సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం పట్టణం మినహాయించి మండలంలోని 75 శాతం గ్రామాల పరిధిలో అంతరాయం కలుగుతుందని తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాల పూజలు



చౌడే పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రం బోయ కొండ గంగమ్మ ఆలయంలో శుక్ర వారం రాహు కాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేద పండితులు రాహుకాలంలో పంచామృతాభి షేకాలు నిర్వహించారు. ఈక్రమంలోనే అమ్మవారిని ప్రత్యేక పూలతో, స్వర్ణా భరణాలతో అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఏకాంబరం భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

సదుం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నాసిరకం ఎరువులు విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తిరుపతి సీఐ వెంకటరవి ఎరువుల దుకాణ దారులను హెచ్చరించారు. సదుంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన తన బృందంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల ధరల పట్టిక, స్టాకు వివరాలు రైతులకు తెలిసేలా దుకాణాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సదస్సులు

చౌడేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడేపల్లిలో జరిగిన సదస్సులో 24 అర్జీలు భూసమస్యలపైనే అందినట్లు డీటీ మాధవి తెలిపారు. ఈ సదస్సులో ఆర్‌ఐ భారతి, సర్వేయర్ గుణ, వీఆర్వోలు విజయకుమార్ రెడ్డి, శ్రీపతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం ఒకరి అరెస్ట్

పుంగనూరు రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డి కథనం మేరకు.. మండలంలోని పిచ్చిగుట్లపల్లె క్రాస్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా చౌడేపల్లె మండలం బత్తలాపురానికి చెందిన రాము 48 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

వి.కోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుంభార్లపల్లెలో జరిగిన సదస్సుకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తహసీల్దార్ పార్వతికి వినతిపత్రాలు అందజేశారు. మొత్తం 18 వినతులు అందాయి. టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్, టీడీపీ అధి కార ప్రతినిధి రాంబాబు, నాగరాజు, గిరి, అక్బర్, సర్పంచ్ సుభాష్, ఆర్‌ఐ మోహన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ద్రోహి జగన్ : గౌనివారి

శాంతిపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన మాజీ సీఎం జగన్ రైతు ద్రోహి అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ వైసీపీ నేతలు కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టడంపై ఆయన స్పందించారు. రైతు భరోసా అంటూ ఏడాదికి రూ. 7500లు ఇచ్చి అన్ని పథకాలు, సబ్సిడీలు నిలిపివేసి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేసిన ఘనుడు జగన్ అని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకొని దేశంలోనే ఏపీ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. కౌలు రైతులను పూర్తిగా ముంచిన ఘనత జగన్‌దే నన్నారు. ధాన్యం సేకరణ కుంభకోణాల మయంగా మారిందన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు రైతుల కోసం రూ.40,772 కోట్లు ఖర్చు చేస్తే అదే వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ.25,428 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రైతన్నకు పెట్టుబడి సాయం రూ.25 వేలకు పెంచిందన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు రూ. 40,402 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు రూ. 1,674 కోట్లు విడుదల చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు సాగుదారుల హక్కు చట్టం-2024 తీసుకువచ్చిందన్నారు. ఈ-పంట ద్వారా 21 జిల్లాలో పంట నష్టపోయిన 1.90 లక్షల మంది రైతులకు రూ.284.56 కోట్లు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. అన్నాదాత సుఖీభవ పథకానికి రూ.4500 కోట్లు నిధులను బడ్జెట్‌లో కేటాయించామని తెలియజేశారు. ఇలా రైతుల కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని గుర్తుచేశారు. అంతేగాని వైసీపీలా రైతుల పేరుతో దోచుకోవడాలు చేయలేదని స్పష్టంచేశారు.

పరిశుభ్రతే ముందు

● ప్రజలు సహకరించాలి ● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



కుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో అభివృద్ధి కంటే ముందు పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కుప్పం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పారిశుధ్య పరిరక్షణకు తనతో సహ సిబ్బంది మొత్తం శాయశక్తులా పాటుపడుతున్నామన్నారు. పట్టణంలో ఏళ్లతరబడి కాలువల్లో పేరుకుపోయిన పూడికను వెలికితీసి శుభ్రం చేస్తున్నామన్నారు. పారి శుధ్య సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కష్టపడి పనిచేస్తున్నా రని అభినందనలు తెలిపారు. అయినా సరే కేవలం 50 శాతం కాలువలను మాత్రమే శుభ్రం చేయగలిగామని, ఇంకా చేయాల్సిన పని మిగిలే ఉందన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ల దిశానిర్దేశంలో పనిచేసుకు పోతున్నామన్నారు. కుప్పం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సమయంలో ప్రారంభ మవుతాయన్నారు. దానికి సంబంధించిన టెండరు వర్క్ ప్రస్తుతం జరుగుతోందన్నారు. మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకే చెత్తను అందించాలని కోరారు. ఎక్కువశాతం మంది అందిస్తున్నారని అభినందించారు. వ్యాపారులు, దుకాణదారులు మాత్రం బాధ్యతా రహితంగా చెత్తను ఇంకా రోడ్లమీదే పడేస్తున్నారని ఆక్షేపించారు. వారు కూడా బాధ్యతగా వ్యవహ రించాలన్నారు. పట్టణం సుందరీకరణలో భాగంగా ట్రాఫిక్ కూడళ్లలో, డివైడర్లలో మొక్కలు పెట్టి సంరక్షిస్తున్నామన్నారు. ఇప్పుడు అవెన్యూ ప్లాంటేషన్‌పైన దృష్టి పెట్టామన్నారు. అయితే పశువులు, గొర్రెలు, మేకలు మొక్కలను మేసేస్తున్నాయని పేర్కొన్నారు. యజమానులు తమ పశువులను రోడ్లమీద వదిలేయకుండా సహకరించాలని కోరారు. లేనిపక్షంలో వ్యాపారులకు కానీ, పశువుల యజమానులకు కానీ నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. ప్రతి మంగళ, శని వారాలలో మున్సిపల్ పరిధిలో ప్రతి ప్రాంతంలో బ్లీచింగ్ చల్లుతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరిలో కుప్పంలో పర్యటించే నాటికి పరిశుభ్ర మున్సిపాలిటీని ఆయనకు బహు మానంగా ఇవ్వాలన్నదే తన తపన అన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రజలు, సిబ్బంది సహక రించాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు.

రైతులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రైతులను దగా చేసిందని టీడీపీ నేతలు విమర్శించారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్.. రైతు భరోసా అంటూ ఏడాదికి రూ.7,500 ఇచ్చి మిగిలిన అన్నిపథకాలు, సబ్సిడీలు నిలిపివేసి, గిట్టుబాటు ధర లేకుండా చేసి రైతులను సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. ఆయన పాలనలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచిందని, 2022-23 సంవత్సరానికి రబీ బీమా ప్రీమియం కూడా చెల్లించకుండా నట్టేట ముంచారని చెప్పారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలు చేశారని, 2800 ఫేక్ ఖాతాలు సృష్టించి రూ.150 కోట్లు దిగమింగారని ఆరోపించారు. అటువంటి వ్యక్తి ఇప్పుడు రైతుల పేరిట నిసనలకు దిగడం దారుణమన్నారు. ఇక కూటమి ప్రభుత్వంలో సీఎం నారా చంద్రబాబు ఆధ్వర్యంలో ఆరు నెలల్లోనే వ్యవసాయ, అనుబంధ శాఖలకు బడ్జెట్‌లో రూ.43.402 కోట్లు కేటాయించి.. రైతులకు అగ్రతాంబూలం ఇచ్చారని తెలిపారు. పంట నష్టపోయిన 1.44 లక్షల మంది రైతులకు రూ.159.2 కోట్ల నష్టపరిహారం మంజూరు చేశారన్నారు. నేతలు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, నేతలు మోహన్‌రాజ్, ఈశ్వర్, నిత్య, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


చదళ్లలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాము

పుంగనూరు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాము కోరారు. శుక్రవారం మండలంలోని చదళ్లలో నిర్వహించిన సదస్సులో రైతుల నుంచి 28 వినతులు స్వీకరించారు. అధికసంఖ్యలో పట్టాపాసుపుస్తకాలపై వినతులు వచ్చినట్లు తెలిపారు. అడంగల్‌లో చేర్పులు, మార్పులు, ఇళ్లపట్టాలు, పొలాల వద్దకు దారి సమస్యలపై అర్జీలు వచ్చినట్లు వివరించారు. ప్రతిఅర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని వివరించారు. వీఆర్వోలు పురుషోత్తంరావు, చందు, నాయకులు వెంకటరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి మధు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఏఎస్‌ఐ రెడ్డిశేఖర్

రామకుప్పం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని శాంతిపురం ఐసీడీఎస్ సీడీపీఓ కల్పన, రామకుప్పం ఏఎస్‌ఐ రెడ్డిశేఖర్, ఎంఈఓ నారాయణప్ప తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండల సచివాలయంలో 'కిశోర వికాసం' కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అంగన్వాడీ సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోక్సో చట్టం, నైపుణ్యాభివృద్ధి, విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, వెంకటేశ్వరీ, పలువురు ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల కైవసంపై టీడీపీ శ్రేణుల కసరత్తు

రామకుప్పం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో జరిగే సాగునీటి ఎన్నికల్లో అన్ని సంఘాలను కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై టీడీపీ శ్రేణులు కసరత్తులో నిమగ్నమయ్యాయి. మండలంలోని రామకుప్పం పెద్దచెరువు, ఆవులకుప్పం పెద్దచెరువు, ఎస్.గొల్లపల్లె చెరువు, విజలాపురంపెద్దచెరువు, కెంచనబల్ల తోట్లచెరువు, సాకలకుప్పం పెద్దచెరువు, సింగసముద్రం పెద్దచెరువుల సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి ఆయా గ్రామాల్లో ఎన్నికల అధికారులు ఈనెల 11న నోటిఫికేషన్లను విడుదల చేశారు. శుక్రవారం 7చెరువుల పరిధిలోని ముఖ్యనేతలు ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సంఘాల చైర్మన్, డైరెక్టర్ అభర్థులు ఖరారు, నామినేషన్ల దాఖలు వంటి అంశాలపై చర్చలు సాగించారు. ప్రతిపక్ష వైసీపీ నేతలు సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

లడ్డూ పోటును పరిశీలించిన ఈవో

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ లడ్డూ పోటును ఈవో పెంచలకిషోర్ శుక్రవారం పరిశీలించారు. లడ్డూ నాణ్యత ఏమాత్రం తగ్గకుండా చూడాలన్నారు. తూకంలో తేడాలు లేకుండా పోటు అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. భక్తులకు సరిపడా లడ్డూలను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలన్నారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సూపరింటెడెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తవణంపల్లె: సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో రెడ్డిబాబు, సీడీపీవో నిర్మల తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. బాల్య విహాలను అడ్డుకోవాలని చెప్పారు.

'కిశోర వికాసం'తో బాలికకు మంచి ఆరోగ్యం


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసంతో బాలికలకు మెరుగైన ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, వైద్యాధికారి జానకీరావు తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం మందిరంలో అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శుక్రవారం కిశోర వికాసంపై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. బాలికలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. బాల్యవివాహాలను అరి కట్టాలని తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, ఏఈ గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలోని వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో అరుణశ్రీ, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, వైద్యాధికారి అరుణ్‌కుమార్, ఆరోగ్యవిద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రప్పస్వామి ఊరేగింపు

సోమల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు బోయవీధిలో కొలువుదీరిన గుర్రప్ప స్వామి అలయ వార్షిక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పుష్పాలంకరణ జరిపి అర్చనలు, హోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. దేవరెద్దుకు పూజలు జరిపి పురవీధుల్లో ఊరేగించారు. పల్లకీలో స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులు తలారి రామకృష్ణ, రెడ్డిప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు న్యాయం


వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ బెన్నురాజ్

సోమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో రైతులకు న్యాయం జరుగుతుందని తహసీల్దార్ బెన్నురాజ్ పేర్కొన్నారు. శుక్రవారం నంజంపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో టీడీపీ జిల్లా మైనార్టీ సంఘ నాయకుడు అష్రఫ్ అలీ మాట్లాడారు. సరస్వతీ పురం సమీపంలో 278/2 సర్వే నెంబరులో 425 ఎకరాల పశువుల బీడు భూమి ఉందని ఆ భూమిని నిరుపేదలకు పంచాలని అధికారులకు వినతి చేశారు. పొలాల వద్దకు దారి వసతి కల్పించాలని గ్రామస్తులు అధికసంఖ్యలో వినతులు అందజేశారు. ఈ సదస్సులో టీడీపీ నాయకులు బాబురావు, సర్వేయర్ షానవాజ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

సోమల ఎంఈవో-1 బాధ్యతల స్వీకరణ



సోమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమల ఎంఈవో-1గా కేశవరెడ్డి శుక్రవారం భవిత కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కేశవరెడ్డిని ఎంఈవో- 2 శివరత్న, సీఆర్పీలు సోమశేఖర్, సురేంద్ర, నారాయణ, అస్లాం బాషా సన్మానించారు.

పసుపు, కుంకుమ అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కొట్టుకుపోయిన బండపల్లె రోడ్డు

పెనుమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి తూపల్లె నుంచి బండపల్లె, చిన్నక లిగిరికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. పూతల పట్టు మండలం నుంచి నీవానది వరద ఉధ్రుతి పెరగడమే దీనికి కారణం. దీంతో అటువైపునకు చేరుకోవాలంటే పెనుమూరు క్రాస్ ద్వారా లేదంటే పూతలపట్టుకు వెళ్లి రావాలి.


కొట్టుకుపోయిన రోడ్డుపై నీటి ప్రవాహం

చెరువులకు జలకళ

వెదురుకుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలోని చెరువులకంతా జలకళ సంతరించుకుంది. 178 చెరువులు ఉండగా, దాదాపుగా అన్నీ నిండిపోయాయి. చాలా చెరువుల కలుజులు పారుతున్నాయి.


నిండుకుండలా కొత్తచెరువు

కృష్ణాపురం జలాశయం గేటు ఎత్తివేత: కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ గేటును శుక్రవారం రాత్రి ఎత్తినట్లు జలవనరుల శాఖ ఏఈ భాస్కరరాజు తెలిపారు. ఈ జలాశయం గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు.

జీడీనెల్లూరులో 13రోజులకే 208 మి.మీ. వర్షపాతం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలంలో ఈనెల ఒకటి నుంచి 13వతేదీ వరకు 208 మిల్లీమీటర్ల (మి.మీ.) వర్షపాతం నమోదైందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డిసెంబరులో సాధారణంగా 53 మి.మీ. వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. ఇప్పటికే సాధారణం కంటే మూడింతలు ఎక్కువగా వర్షం కురిసిందని చెప్పారు. కలిజవేడు - కొట్రకోన పంచాయతీల మధ్య, ఆత్మకూరు - నరసింగరాయనిపేట పంచాయతీల మధ్య నీవానది ఏటిలోని మట్టి రోడ్లు కోతకు గురై రాకపోకలకు ఆటంకం ఏర్పడిందన్నారు. అరవచేనుపల్లె - చౌటూరుకు వెళ్లే దారిలో వంక దారితెగిపోయి ప్రజలకు ఇబ్బంది కల్గిందన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి: సీపీఐ

చిత్తూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పాంచాలిపురంలో నీట మునిగిన వరి పొలాలను నాయకులు పరిశీలించారు. మనోజ్, చంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరిని చూపుతున్న సీపీఐ నాయకులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తవణంపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుధాకర్ అన్నారు. శుక్రవారం ఎగువతడకరలో జరిగిన సదస్సులో ఏడు అర్జీలు అందాయన్నారు. ఆర్ఐ జీవన్ సాగర్, సర్వేయర్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



గుండ్లకట్టమంచి సదస్సులో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్

శ్రీరంగరాజపురం: దుర్గరాజపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 10 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ లోకనాథం పిళ్ళై తెలిపారు. డీటీ రవీంద్రబాబు, మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: కాళికాపురంలో జరిగిన సదస్సులో తహసీల్దార్ కిరణ్, డీటీ అశోక్, సర్వేయర్ శేఖర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: ఉన్నత పాఠశాలలో జరిగిన సదస్సులో 51 అర్జీలు అందాయని తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. డీటీ జయంతి, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: గుండ్లకట్టమంచిలో జరిగిన సదస్సులో ఏడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: పాలకూరులో జరిగిన సదస్సులో తహసీల్దార్ గుర్రప్ప, డీటీ మహేశ్వరి, సర్పంచ్ పంకజాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతకు నివాళి

నగరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కీళపట్టుకు చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ రాజేంద్ర మృతి చెందారు. దీంతో ఆయన మృతదేహానికి శుక్రవారం పూలమాల వేసి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నివాళి అర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నగరి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు రమేష్ బాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్ర మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

యాదమరి - గుడియాత్తం రహదారి పనులకు నేడు భూమిపూజ

యాదమరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదమరి - గుడియాత్తం అంతరాష్ట్ర రహదారిలోని జోడిచింతల నుంచి కన్నికాపురం వరకు గోతులతో నిండి 11 కి.మీ రహదారి మరమ్మతు పనులు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జరిగే భూమిపూజ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు పలువురు హాజరుకానున్నారు. కాగా, ఈ పనులకు ఉపాధి హామీ పథకం కింద రూ.5.90 కోట్లు మంజూరయ్యాయి.

గంగ జాతర వేషాలు



వెదురుకుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గంగ జాతర చాటింపుతో కొందరు వేషాలు వేసుకుని పురవీధుల్లో తిరిగారు. వచ్చే మంగళవారం గంగ జాతర జరగనుంది.

లడ్డూ పోటును పరిశీలించిన ఈవో

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ లడ్డూ పోటును ఈవో పెంచలకిషోర్ శుక్రవారం పరిశీలించారు. లడ్డూ నాణ్యత ఏమాత్రం తగ్గకుండా చూడాలన్నారు. తూకంలో తేడాలు లేకుండా పోటు అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. భక్తులకు సరిపడా లడ్డూలను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలన్నారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

పాలసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాచపాళ్యం గ్రామంలోని బాలగురునాథీశ్వరాలయంలో శుక్రవారం కార్తీక దీపోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో కలశాలను ఏర్పాటు చేసి హోమం చేశారు. మూల విరాట్‌కు అభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ముందు 40 లీటర్లతో నెయ్యి దీపాన్ని వెలిగించారు. ఆలయం చుట్టూ 101 నెయ్యి దీపాలను ఏర్పాటు చేశారు. కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. మండలవాసులతోపాటు బెంగళూరు, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.


బాలగురునాథీశ్వర ఆలయంలో వెలిగించిన కార్తీక దీపం

గుడిపాల: పాళ్యంకొండపై వెలసి ఉన్న ఆంజనేయస్వామి పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. కందగిరికొండపై ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. కందగిరికొండ ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, పాళ్యంకొండ ఆంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు పాల్గొన్నారు.


పాళ్యంకొండలో హోమం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

వెదురుకుప్పం: కార్వేటినగరం కుమారగిరిపై ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై, పుష్కరిణి వద్ద కార్తీక దీపం వెలిగించారు.

నగరి: కరకంఠేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కీళపట్టు చంద్రమౌళీశ్వరాలయంలో తిరువణ్ణామలై కార్తీక దీపాన్ని పోలిన విధంగా ఆలయంపై దీపాన్ని వెలిగించారు. దేశమ్మ దేవాలయ గోపురంపైనా కార్తీక దీపం వెలిగించారు. ఓంశక్తి, అగరవినాయకస్వామి ఆలయాల్లో కార్తీక దీపోత్సవం జరిగింది.


చంద్రమౌళీశ్వర ఆలయంపై..

రైతులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

టీడీపీ నేతల విమర్శ

చిత్తూరు సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రైతులను దగా చేసిందని టీడీపీ నేతలు విమర్శించారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్.. రైతు భరోసా అంటూ ఏడాదికి రూ.7,500 ఇచ్చి మిగిలిన అన్నిపథకాలు, సబ్సిడీలు నిలిపివేసి, గిట్టుబాటు ధర లేకుండా చేసి రైతులను సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. ఆయన పాలనలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచిందని, 2022-23 సంవత్సరానికి రబీ బీమా ప్రీమియం కూడా చెల్లించకుండా నట్టేట ముంచారని చెప్పారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలు చేశారని, 2800 ఫేక్ ఖాతాలు సృష్టించి రూ.150 కోట్లు దిగమింగారని ఆరోపించారు. అటువంటి వ్యక్తి ఇప్పుడు రైతుల పేరిట నిరసనలకు దిగడం దారుణమన్నారు. ఇక కూటమి ప్రభుత్వంలో సీఎం నారా చంద్రబాబు ఆధ్వర్యంలో ఆరు నెలల్లోనే వ్యవసాయ, అనుబంధ శాఖలకు బడ్జెట్‌లో రూ.43.402 కోట్లు కేటాయించి.. రైతులకు అగ్రతాంబూలం ఇచ్చారని తెలిపారు. పంట నష్టపోయిన 1.44 లక్షల మంది రైతులకు రూ.159.2 కోట్ల నష్ట పరిహారం మంజూరు చేశారన్నారు. నేతలు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, నేతలు మోహన్‌రాజ్, ఈశ్వర్, నిత్య, తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

యూపీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రశాంత్‌నగర్, టెలిఫోన్ కాలనీ యూపీహెచ్‌సీలను శుక్రవారం డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి తనిఖీ చేశారు. అందుతున్న వైద్యసేవలపై రోగులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు.

గుకేశ్‌ను చూసి గర్విస్తున్నాం

- ఏపీ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్



చిత్తూరు క్రీడలు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో 18 ఏళ్ల గుకేశ్.. చైనాకు చెందిన 32 ఏళ్ల క్రీడాకారుడితో పోరాడి గెలిచిన తీరును చూసి గర్విస్తున్నామని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పలమనేరు రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గుకేష్.. చిత్తూరు ఉమ్మడి జిల్లా వాసికావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా నుంచి మరింత మంది చెస్‌లో గ్రాండ్ మాస్టర్లుగా ఎదగాలన్నారు.

ఒంటరి మహిళకు టీడీపీ సాయం



వెదురుకుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట కాలనీకి చెందిన ఒంటరి మహిళ పాంచాలమ్మకు టీడీపీ నాయకులు శుక్రవారం సాయం అందించారు. తుఫాను కారణంగా పూరి గుడిసె ప్రమాదస్థితికి చేరుకోవడంతో ఆమెను అంగన్వాడీ కేంద్రానికి తరలించారు. తమ వంతుగా దుస్తులు, పండ్లు, ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ ఎస్సీ సెల్ మండల ప్రధానకార్యదర్శి చెంగల్రాయులు, మండల యువత ప్రధాన కార్యదర్శి డిల్లీబాబురెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్ఎం కాంప్లెక్సులో తనిఖీలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొంగారెడ్డిపల్లె వద్ద ఉన్న ఏఎస్ఎం మున్సిపల్ కాంప్లెక్స్‌ను సహాయ కమిషనర్(ఏసీ) ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో పారిశుధ్యం లోపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాల అద్దె బకాయిలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. బకాయిలున్న వారికి వెంటనే నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఆర్వో గోపాలకృష్ణ వర్మ, ఆర్ఐ అమరనాథరెడ్డి పాల్గొన్నారు.


దుకాణాల పరిశీలనలో ఏసీ ప్రసాద్

ఆయుర్వేద వైద్యశాల సందర్శన

వెదురుకుప్పం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని డీఎం పురం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు పక్కా భవన వసతి కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మాల కార్పొరేషన్ మెంబరు, జనసేన జీడీనెల్లూరు ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ తెలిపారు. శుక్రవారం ఆయుర్వేద వైద్యశాలను సందర్శించారు. భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతుండటాన్ని ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు.


దెబ్బతిన్న భవనాన్ని పరిశీలిస్తున్న యుగంధర్

టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఉపాధ్యాయ యూనియన్ రూపొందించిన టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్లను జేసీ విద్యాధరి శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సీనియర్ ఉపాధ్యాయులతో వీటిని రూపొందించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు వీటిని పంపిణీ చేయడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎస్.మణిగండన్, సహాధ్యక్షులు కె.రెడ్డెప్ప నాయుడు, ఎస్.రిహానా బేగం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

టీడీపీ సభ్యత్వ నమోదు

వెదురుకుప్పం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట పంచాయతీ కలికిరిండ్లులో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. మండల యువత ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి, ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి చెంగల్రాయులు, నాయకులు ముని, నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏర్పడి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి లావణ్య శుక్రవారం శ్రీనివాస మంగాపురంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేటినుంచి ఆరాధనోత్సవాలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సుగుణేంద్ర తీర్థ మూల బృందావనంలో శని, ఆది, సోమవారాల్లో స్వామివారి ఆరాధనోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. ఈ మేరకు మఠం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు మంత్రాలయం పీఠాధిపతులు విచ్చేయనున్నారని పేర్కొన్నారు.

సబ్‌సెంటర్‌లో తనిఖీలు

పూతలపట్టు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ స్టాటిస్టికల్ ఆఫీసర్ జార్జ్ కోరారు. శుక్రవారం ఆయన ఎం.బండపల్లెలోని సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంతరం పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్కే జిల్లా కోఆర్డినేటర్ శిరీష, వైద్యులు ప్రియాంక, ప్రవీణ, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రదోష పూజలు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేతచిదంబరేశ్వర ఆలయంలో స్వామి అమ్మవార్ల ప్రదోష పూజలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పూతలపట్టు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మిరెడ్డిపల్లె దళితవాడకు చెందిన రఘునాథయ్య (71) శుక్రవారం సచివాలయం వద్దకు వెళ్లి ఇంటికి రోడ్డుపక్కన నడిచి వస్తున్నాడు. పీలేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న లారీ వెనుక వైపునుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 20 మందికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో 20 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా కేసు నమోదు చేశారు. నిందితులను శుక్రవారం జూనియర్ సివిల్‌కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున 20 మందికి రూ.2లక్షల జరిమానా విధించారు.

సైబర్ నేరాలపై అవగాహన

తవణంపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో రెడ్డిబాబు, సీడీపీవో నిర్మల తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. బాల్య వివాహాలను అడ్డుకోవాలని చెప్పారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో శ్యామ సుగుణ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్టు లావాదేవీలపై విచారణ ప్రారంభం

పెనుమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులో నిర్వహిస్తున్న మహిళా మార్టులో జరుగుతున్న వ్యాపార లావాదేవీలపై ఆడిట్ బృందం విచారణ చేపట్టారు. మహిళామార్టు 'లెక్క' ఎక్కడ సార్..? అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. ఆడిట్ బృందాన్ని నియమించడంతో శుక్రవారం వారు వెలుగు కార్యాలయంలో విచారణ మొదలుపెట్టారు. నెలకు రూ.3 లక్షలకు తగ్గకుండా మహిళలతో సరుకులు కొనుగోలు చేయించారు. ఈ లెక్కన 2023-24 వార్షిక సంవత్సరంలో సుమారు రూ.36 కోట్ల వరకు సరుకులు కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. మార్టును సభ్యుల వాటా రూ.27 లక్షలు, మండల సమాఖ్య ద్వారా రూ.10.50 లక్షలు, జిల్లా సమాఖ్య ద్వారా రూ.10 లక్షలు మొత్తం రూ.47 లక్షలతో మార్టును ప్రారంభించినట్లు చూపారు. ఈ లెక్కలపై ఆడిట్ అధికారులు శంఖర్, డీపీఎం రవి, డీఎంజీ లలిత, మోహన్‌క్రిష్ణలు రోజంతా తనిఖీలు చేశారు. రెండ్రోజులు పడుతుందని చెప్పారు. ఆడిట్ పక్కాగా నిర్వహించాలని పీడీ శ్రీదేవి సూచించారన్నారు.


వెలుగు కార్యాలయంలో ఆడిట్ బృందం

డీకే చెరువు ఉన్నత పాఠశాలలో

మౌలిక వసతుల కరువు

అధ్వానంగా మరుగుదొడ్లు, కానరాని ప్రహరీ

యాదమరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని అటవీ ప్రాంతంలో ఉండే డీకే చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులూ కరువయ్యాయి. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 39 మంది బాలురు, 45 మంది బాలికలు చదువుకుంటున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. బహిర్భూమి అత్యవసరమైతే పంటపొలాల్లోకి వెళ్లాల్సిందే. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద కూడా పైసా విదల్చలేదు.. అధికారులూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం: అటవీ ప్రాంతం కావడంతో విద్యార్థులకు వన్యమృగాల నుంచి ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏనుగుల మంద ఈ పాఠశాల గుండా వెళ్లాయని తెలిపారు.


ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలో ఆవులు


శిథిలావస్థలో మరుగుదొడ్లు



తరగతి గదుల కొరత

కొత్త భవనాల నిర్మాణం చేపట్టక పోవడంతో తరగతి గదుల కొరత ఉంది. ఏడో తరగతి విద్యార్థులకైతే వరండాయే తరగతి గది అయింది.